క్లుప్తంగా

సీఎంను కలిసిన ఏలూరి



సీఎంకు శుభాకాంక్షలు చెబుతున్న ఏలూరి శ్రీనివాసరావు

ఖమ్మం సహకారనగర్: ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రేవంత్‌రెడ్డిని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం(టీజీవోస్) రాష్ట్ర నాయకుడు ఏలూరి శ్రీనివాసరావు హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కూడా ఆయన కలిశారు.

రాష్ట్ర స్థాయి కరాటే టోర్నీలో ప్రతిభ

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన ఇటీవల నల్లగొండలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్–14, 17 కరాటే పోటీల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటారు. అండర్–14 బాలుర విభాగంలో ఎం.డీ.అబ్దుర్‌రఖీబ్, ఎస్.కే.ఇర్ఫాన్, అండర్–17 బాలురలో సయ్యద్ సాలీన్, ఎస్.డీ.ఆదిల్‌పాషా పతకాలు సాధించారు. ఈసందర్భంగా విద్యార్థులను జిల్లా పాఠశాలల క్రీడల కార్యదర్శి కె.నర్సింహామూర్తి, కరాటే మాస్టర్ సయ్యద్ మహబూబ్‌పాషా అభినందించారు.

రేపు పెన్షనర్ల సమావేశం

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ ఖమ్మం జిల్లా సమావేశం ఈ నెల 9వ తేదీన నగరంలోని రిక్కాబజార్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ బాధ్యులు పరిశ పుల్లయ్య, కె.కృష్ణమూర్తిలు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.రాజేంద్రబాబు, ప్రధాన కార్యదర్శి ఎంవీ నర్సింగరావు, ఉపాధ్యక్షుడు టి.పురుషోత్తం తదితరులు పాల్గొంటుండగా.. జిల్లా శాఖను ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు.

దివ్యాంగులు ఉపాధి రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న డీడబ్ల్యూఓ సుమ

ఖమ్మంవన్‌టౌన్: దివ్యాంగులు కుంగిపోకుండా ఉపాధి రంగాల్లో రాణించాలని డీడబ్ల్యూఓ సుమ సూచించారు. ఎనేబుల్ ఇండియా అండ్ శ్రీ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యాన ఖమ్మంలో ఏర్పాటుచేసిన గ్రామీణ దివ్యాంగుల జీవనోపాధి కేంద్రాన్ని గురువారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. నైపుణ్యం ఉన్న రంగాలను ఎంచుకుంటే రాణించవచ్చని తెలిపారు. కాగా, దివ్యాంగులకు వ్యాపారాభివృద్ధి, నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఎనేబుల్ ఇండియా రాష్ట్ర ప్రతినిధి మల్లికార్జున్, శ్రీ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ డైరెక్టర్ రాంబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో గడ్డం రాంబాబు, నరేంద్ర స్వరూప్, అన్నం శ్రీనివాసరావు, భానుచందర్, మధు, చాంద్ పాషా, రాంబాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు



ఈర్లపుడిలో శుభ్రం చేస్తున్న కార్మికులు

రఘునాథపాలెం: తుపాన్ ధాటికి గ్రామాల్లో పేరుకుపోయిన మురుగు, చెత్తా చెదారం తొలగింపు పనులను గురువారం అన్ని పంచాయతీల్లో చేపట్టినట్లు ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డిల పర్యవేక్షణలో పారిశుద్ధ్య పనులు సాగుతుండగా.. గ్రామ కార్యదర్శులు పారిశుద్ధ్య కార్మికుల చేత పరిసరాల పరిశుభ్రతను కొనసాగించారు. ఈమేరకు మురుగు నీటి నిల్వలు తొలగింపు, దోమల నివారణకు బ్లీచింగ్ చల్లడం, బాల్స్ వేయడం తదితర పనులు చేట్టారు.

నగరంలో సినిమాలు

తిరుమల	యానిమల్
వినోద	హాయ్ నాన్న
సాయిరాం	సహస్ర
ఆదిత్య	హాయ్ నాన్న
శ్రీనివాస	ఎక్స్ట్రా ఆర్డినరీ మ్యాన్

- ఖమ్మంగాంధీచౌక్

కోలుకోలేని కష్టం.. నష్టం



రఘునాథపాలెం: తుపాన్ ధాటికి నేలవాలిన మిర్చి తోట

మిచాంగ్ ధాటికి దెబ్బతిన్న పంటలు

- పొడైన పంటలను చూసి గొల్లుమంటున్న అన్నదాతలు
- ప్రశ్నార్థకంగా మారిన పంట పెట్టుబడులు
- ప్రభుత్వ సాయం కోసం రైతన్నల ఎదురుచూపులు
- నష్టంపై ఆరా తీస్తున్న అధికారులు



తిరుమలాయపాలెం: నేలకొరిగిన వరి పంట

రఘునాథపాలెం/ఖమ్మంరూరల్: ఆరుగాలం కష్టపడి.. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి.. నేడో రేపో పంట చేతికందుతున్న తరుణంలో అకాల తుపాన్ నిలువునా ముంచిందని రైతులు వాపోతున్నారు. గత రెండు రోజుల పాటు ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షానికి, వీచిన ఈదురు గాలులకు వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న తదితర పంటలు నేలకొరిగి నీట మునిగాయి. కోతకొచ్చిన వరిపైరు, కోసిన వరి పనలు నీటిలో మునగడంతో పాటు పత్తి, మిర్చి ఇతర పంటలను చూసి రైతులు గొల్లుమంటున్నారు. పంట వేసిన దగ్గర నుంచి విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చు కలిపి వరికి ఎకరాలకు రూ.40వేలు, పత్తికి రూ.30వేలు ఖర్చు చేసి పంటలు పండిస్తే.. అకాల వర్షం తమ పాలిటి శాపంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల సర్వే షురూ..

రఘునాథపాలెం మండలంలో 4 వేల ఎకరాలకు పైగా వరి సాగు చేయగా.. సుమారు 2 వేల ఎకరాలకుపైగా తుపాన్ ధాటికి నష్టం జరిగిందని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. కనీసం ఎకరానికి రూ. 10 వేలకు పైగానే పంట నష్టం జరిగిందని, పెట్టుబడులు కూడా ప్రశ్నార్థకంగా మారిందని పేర్కొంటున్నారు. పడిపోయిన వరి కోతలు చేయాలంటే ఖర్చు కూడా రెట్టింపు అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిర్చి తోటలు ఏపుగా పెరిగి కాపుకాస్తున్న తరుణంలో ఎక్కడికక్కడ పడిపోవడంతో కాయ నష్టంతో పాటు కొన్ని మొక్కలు ఎండిపోవడం, మిగిలిన పంట కూడా ఏపుగా పెరిగే అవకాశం లేకుండా పోతుందని కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ప్రస్తుతం నేలవాలిన మిర్చి మొక్కలను కర్రపుల్లల సాయంతో నిలబెట్టే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. గత ఐదారేళ్లుగా వరుస నష్టాలు చవిచూస్తున్న రైతులు ఈసారైనా పంటలు పండి అప్పులు తీరుతాయనుకుంటున్న తరుణంలో తుపాన్ దాటికి పంటలు నేలపాలు కావడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. చీడపీడలకు తోడు ప్రకృతి ప్రకోపంతో పంటలను కోల్పోయి రైతులు లబోదిబోమంటున్నారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

తీత దశలో పత్తికి దెబ్బ..

పత్తి సాగు చేసిన అన్నదాతలు తీతల దశలో అకాల వర్షంతో నేలరాలిందని, ఉన్న పత్తి కాస్తా తడిసిముద్దగా మారడంతో సాగుకు పెట్టిన పెట్టుబడులు కూడా వస్తాయో, రావోనని భయపడుతున్నారు. ప్రభుత్వం జరిగిన నష్టంపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యాన సమగ్రమైన సర్వే చేసి రైతులను ఆదుకోవాలని అన్నదాతలు వేడుకుంటున్నారు. కాగా, దెబ్బతిన్న పంటలను బుధ, గురువారాల్లో రఘునాథపాలెం మండలంలోని వివిధ గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీనివాసరావు, ఏఓ భాస్కరరావులు పర్యటించి పరిశీలించి రైతులకు సూచనలు చేయడంతో పాటు పంటల నష్టాలపై అంచనాలు రూపొందించారు.

అంచనాలు రూపొందిస్తున్నాం..



మండలంలో తుపాన్ ధాటికి నష్టపోయిన పంటల వివరాలు రూపొందిస్తున్నాం. ప్రాథమికంగా గుర్తించి సమగ్ర నివేదికల కోసం గ్రామాల్లో సాగుచేసిన పొలాల వారీగా తిరిగి, నష్టం అంచనాల వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తాం. మండలంలో అత్యధికంగా వరి, మిర్చి పంటలకు నష్టం వాటిల్లింది.

– ఈ.భాస్కరరావు, మండల వ్యవసాయ అధికారి

రూ.10 లక్షలకు పైగా నష్టపోయా..



తుపాన్ ప్రభావంతో రూ.10 లక్షలకు పైగా నష్టం వచ్చింది. ఐదెకరాలు కౌలుకు తీసుకొని వేలాది రూపాయాలు పెట్టుబడి పెట్టి మిర్చి సాగు చేశా. కానీ తుపాన్ బీభత్సానికి తోట వద్దకు వెళ్లే దుఃఖం ఆగడం లేదు. చలి జ్వరం వచ్చినట్లు ఉంది. ఆ తోటను ఎలా కాపాడుకోవాలో అర్థం కావడం లేదు.

– జాటోత్ సూర్య, రైతు, శివాయిగూడెం

రెండెకరాల వరి తడిసింది..



రెండెకరాల్లో వరి వేశా. ఇప్పటికే రూ. 80వేలు పెట్టుబడి పెట్టినా. తీరా కోతకు వచ్చే సమయాన తుపాన్ రావడంతో పంట నేలవాలి గింజలు తడిసి ముద్దయ్యాయి. ఇప్పుడు పంట కోద్దామంటే తడిసిపోయి ఉంది. తడిసిన ధాన్యానికి మద్దతు ధర కాదుగదా అసలు కొంటారో లేదో తెలియడంలేదు.

– పి. పరశురాం, రైతు, చింతపల్లి

ప్రభుత్వమే ఆదుకోవాలి.,



మూడెకరాల్లో మిర్చి వేశా. ఇప్పటికూ రూ. 2లక్షలు పెట్టుబడి పెట్టినా. తోట ఏపుగా వస్తున్న క్రమంలో తుపాన్ ధాటికి మిర్చి చెట్లు నేలకొరిగాయి. వాటిని కర్రపుల్లల సాయంతో సరిచేస్తున్నాం. పంట కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

– నర్రా వెంకటనర్సయ్య, రైతు, పోచారం

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి




కామేపల్లి: వరి పంటను పరిశీలిస్తున్న నాయకులు



రఘునాథపాలెం: రాంక్యాతండాలో మిర్చి తోటను పరిశీలిస్తున్న నాయకులు

కామేపల్లి/రఘునాథపాలెం: తుపాన్ కారణంగా పంటలు దెబ్బతిన్న రైతాంగానికి నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని ఖమ్మం డివిజన్ సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యదర్శి కోలా లక్ష్మీనారాయణ, అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీకేఎస్) ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మలీదు నాగేశ్వరరావు, ఆవుల వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం కామేపల్లి, హరిశ్చంద్రాపురం గ్రామాల్లో కోలా లక్ష్మీనారాయణ, రఘునాథపాలెం మండలం రాంక్యాతండాలో నాగేశ్వరావు, వెంకటేశ్వర్లు వర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలించిన సందర్భంగా మాట్లాడారు. వేల రూపాయలు పెట్టుబడి పెట్టి పంట చేతికి వచ్చే సమయంలో అకాల వర్షంతో వరి, మిర్చి పంటలతో పాటు పత్తి, కూరగాయాల పంటలు దెబ్బతిన్నాయని ,వర్షం దాటికి దెబ్బతిన్న పంటలను వ్యవసాయ అధికారులచే క్షేత్ర స్థాయిలో సర్వే చేసి నష్టాన్ని అంచనా వేసి నష్ట పరిహారం అందించాలన్నారు. ఎకరా మిర్చికి రూ.లక్ష, వరికి రూ.50 వేలు, పత్తికి రూ.30 వేలు చొప్పున రైతులకు పరిహారం అందించి రైతాంగాన్ని ప్రభుత్వం అండగా నిలవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం నాయకులు కేలోతు లక్ష్మణ్ ,ధరావతు లక్ష్మణ్ , కేళోతు పాపారావు, గుగులోతు లచ్చు, నాయకులు ఆంగోత్ భీమ్‌సింగ్, జర్పుల సామ్య, లాల్‌సింగ్, సాల్క్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న అధ్యక్ష, కార్యదర్శులు

కామేపల్లి: ఏళ్లుగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేందుకు కృషి చేయాలని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు గుడిపూడి శ్రీనివాసరావు కోరారు. గురువారం కొత్తలింగాల గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల జీపీఎఫ్, సరెండర్ లీవ్, డీఏ, మెడికల్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని, జీఓ నంబర్ 317తో పాటు సీపీఎస్‌ను రద్దు చేయాలని, వివిధ సమస్యలను ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారం చేయాలన్నారు. ఈ సమావేశంలో కార్యదర్శి పి.రాములు, నాయకులు వెంకటేశ్వర్లు, నాగిరెడ్డి, వెంకటరమణ, వెంకన్న, మురళీధర్ రెడ్డి, మీత్యా, మాలిక, జయ పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దు..

కామేపల్లి: మండలంలోని పండితాపురం గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరు వ్యవహరించినా కఠిన చర్యలు తప్పవని ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డి హెచ్చరించారు. గ్రామానికి చెందిన తండ్రీకొడుకులు చల్లా లాలయ్య, దాక్ష పొలం వద్దకు వెళ్లి ద్విచక్రవాహనంపై వస్తుండగా అదే గ్రామానికి చెందిన కొందరు మార్గమధ్యలో అడ్డుకుని దాడి చేయగా.. దాక్షకు చేయి విరిగింది. ఈ విషయం తెలుసుకున్న ఏసీపీ బస్వారెడ్డి చేరుకుని వివరాలు ఆరా తీశాక ఘనటపై లాలయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేశారు. గ్రామంలో శాంతిభద్రతల పరిస్థితిపై సీఐ తిరుపతిరెడ్డి, ఎస్సై ప్రవీణ్‌కుమార్‌తో చర్చించాక పలు సూచనలు చేశారు. కాగా, పండితాపురంలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసిన నాటి నుంచి పోలీసు పికెటింగ్ నిర్వహిస్తున్నా తరచు గొడవలు జరుగుతుండడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసినా ఫలితాలు వెలువడ్డాక గొడవలు జరుగుతున్నాయి.

రహదారి అధ్వానం..!

ఖమ్మం నుంచి ముదిగొండ వెళ్లే రోడ్డు గుంతలతో ఇదిగో ఇలా అధ్వానంగా దర్శనమిస్తోంది. రోడ్డుపై గుంతలు పడడంతో వర్షానికి నీరు నిండి గుంతలు కనపడకా వాహనదారులు ఈ రోడ్డుపై ప్రయాణించడానికి నానా అవస్థలు పడుతున్నారు. నడి రోడ్డుపై గుంతలు పడినా ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్





‘ఉపాధి’ కూలీల సంఖ్య పెంచాలి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

నేలకొండపల్లి: మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీల సంఖ్యను మరింత పెంచాలని నేలకొండపల్లి ఎంపీడీఓ కె.జమలారెడ్డి సూచించారు. మండలంలోని నాచేపల్లిలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను గురువారం పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈమేరకు పని ప్రదేశంలో మస్టర్‌ను తనిఖీ చేసి కూలీల హాజరును తీసుకున్నారు. ఉపాధి పథకం పనులు ప్రతీ ఒక్కరికి కల్పించేలా కార్యచరణ రూపొందించాలని, నర్సరీలో బ్యాగ్ ఫిల్లింగ్ పనులు శరవేగంగా పూర్తి చేసేలా పంచాయతీ కార్యదర్శులు, క్షేత్రస్థాయి సహాయకులు చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగమణి, ఈజీఎస్ టీ.ఏ. యాకయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల విస్తృత తనిఖీ

నేలకొండపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో విద్యుత్ విజిలెన్స్ ఏడీ సత్యనారాయణ గురువారం విస్తృతంగా తనిఖీ చేశారు. పంచాయతీల ఆధ్వర్యాన నిర్వహిస్తున్న వీధి లైట్లు, తాగునీటి సరఫరాకు చెందిన విద్యుత్ మీటర్లను నేలకొండపల్లి, సింగారెడ్డిపాలెం, ముజ్జుగూడెం, అనాసాగారాం, సదాశివాపురం తదితర గ్రామాల్లో క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యుత్ అధికారులకు పలు సూచనలు, సలహాలు అందించగా.. నేలకొండపల్లి ఏఈ కె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రులు, ఎమ్మెల్యేలకు శుభాకాంక్షలు

మంత్రులను కలిసిన మున్నూరు కాపులు



మంత్రి తుమ్మలతో మున్నూరు కాపు సభ్యులు

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర మంత్రులుగా బాధ్యతలు చేపట్టిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులను గురువారం మున్నూరు కాపు సంఘం జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. 58వ డివిజన్‌కు చెందిన పార్టీ శ్రేణులతో కలిసి హైదరాబాద్‌లో ఉన్న వారి నివాసాలలో కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో పార్టీ సీనియర్ నాయకులు కల్లూరి సోమనాథం, సముద్రాల శ్రీనివాసరావు, ఎమ్మని వీరభద్రం, నల్లమల వేణు, వాలబోయిన వెంకటేశ్వర్లు, సుధాకర్, రాజా, ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రులకు నాయకులు..

నేలకొండపల్లి: డిప్యూటీ సీఎంగా భట్టి విక్రమార్క, మంత్రులుగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులు ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా మండల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేసి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేశ్, కోడాలి గోవిందరావు, సర్పంచ్ పెంటమళ్ల పుల్లమ్మ, నాయకులు రావెళ్ల కృష్ణారావు, ఉండమోదుగల వెంకటేశ్వర్లు, కొమ్మూరి నరేశ్, పాకనాటి కన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం, మంత్రులకు..

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఎనుముల రేవంత్‌రెడ్డికి, మంత్రి వర్గ సహచరులకు బీఆర్‌ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. మంత్రివర్గంలో ఉప ముఖ్యమంత్రిగా మల్లు భట్టి విక్రమార్క, మంత్రులుగా తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు ఖమ్మం జిల్లా నుంచి ప్రాతినిధ్యం పొందడం సంతోషకరమైన విషయం అన్నారు. వారికి తన తరపున, జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ తరుపున శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకుంటూ జిల్లా సమగ్ర అభివృద్ధికి ముగ్గురు మంత్రులు కృషి చేయాలని కోరుతున్నట్లు చెప్పారు.

మంత్రి తుమ్మలను కలిసిన ఎంపీటీసీ..



తుమ్మలకు శుభాకాంక్షలు తెలుపుతున్న లక్ష్మయ్య

కామేపల్లి: మంత్రి తుమ్మల నాగేశ్వరరావును పింజరమడుగు ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్య గురువారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

భట్టిని కలిసిన ఎస్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



భట్టికి పుష్పగుచ్ఛం అందిస్తున్న సైదులు

ఖమ్మం సహకారనగర్: హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం, రెవెన్యూ శాఖమంత్రిగా భట్టి విక్రమార్క బాధ్యతలు స్వీకరించడంతో గురువారం ఎస్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులు మార్యదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా భట్టి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కనకయ్యకు డీసీసీబీ డైరెక్టర్..



కోరంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న మల్లిబాబు

కామేపల్లి: ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్ గురువారం హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు షేక్ ఫత్తేమహ్మద్, బొమ్మిడి శ్రీనుయాదవ్, చెన్ను వెంకటరమణ, బాలిని శ్రీశైలం, పల్లెబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో మొక్కులు చెల్లించిన కాంగ్రెస్ శ్రేణులు



కొబ్బరికాయలు కొడుతున్న కాంగ్రెస్ నాయకులు

రఘునాథపాలెం: మండలంలోని కోటపాడు శివాలయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, సీఎంగా రేవంత్ రెడ్డి, మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా గురువారం కాంగ్రెస్ నాయకుడు రమేశ్ ఆధ్వర్యాన కాంగ్రెస్ నాయకులు మొక్కులు చెల్లించారు. పురాతన దేవాలయంలో పూజలు నిర్వహించి నూట ఒక్క (101) కొబ్బరికాయలు కొట్టారు.

ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలి

నేలకొండపల్లి: కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ప్రజల ఆకాంక్షాలను నెరవేర్చాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు పసుమర్తి శ్రీనివాస్ కోరారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో నూతన ప్రభుత్వం ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల నమ్మకాన్ని వెంటనే అమలు చేసే దిశగా ముందుకు సాగాలని కోరారు. జిల్లాలోని భట్టి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రమాణ స్వీకారానికి తరలిన నాయకులు



పొంగులేటి శ్రీనివాసరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుకున్న చావా శివరామకృష్ణ, తదితరులు

తిరుమలాయపాలెం: దశాబ్ద కాలం తర్వాత తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గురువారం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారానికి మండలంలోని ఆయా గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు భారీగా తరలివెళ్లారు. రాష్ట్ర కేబినెట్‌లో పొంగులేటి శ్రీనివాసరెడ్డికి చోటు లభించడంతో పాలేరు నియోజకవర్గ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, రైతు సమన్వయ సమితి మాజీ మండల కన్వీనర్ చావా శివరామకృష్ణ తదితరులు మంత్రి పొంగులేటిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పొంగులేటికి మంత్రి పదవితో పాలేరు నియోజకవర్గం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు.